సాక్షి ఖమ్మం

ఆదివారం । 28 । జనవరి । 2024



రైతులకు నష్టం ఎదురుకావొద్దు

మిర్చి రైతులు నష్టపోకుండా నాణ్యత ఆధారంగా ధర నిర్ణయించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ సూచించారు.

8లో



24కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మం, కూసుమంచిలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో నలుగురు తరలిస్తున్న 24కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

8లో

గరిష్టం / కనిష్టం 31° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరుగుతాయి. ఉదయం, రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి అమ్మ వారిని పట్టువస్త్రాలతో అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీ సేవ జరిపించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి 'ఆరోగ్య' సేవల అవార్డు



సూపరింటెండెంట్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఉత్తమ ఆరోగ్యశ్రీ సేవల అవార్డు వరించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు గత నెల 9న ప్రారంభం కాగా ఇప్పటివరకు ఆస్పత్రిలో 727 శస్త్రచికిత్సలు చేసి రాష్ట్ర స్థాయిలో రికార్డు సాధించారు. తద్వారా ఆస్పత్రికి రూ.1.38 కోట్ల ఆదాయం లభించింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన అవార్డును గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అందజేసి అభినందించారు.

నేటి నుంచి ఓపెన్ డిగ్రీ తరగతులు

ఖమ్మం సహకారనగర్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ తరగతులు ఆదివారం మొదలుకానున్నాయి. ఈ విషయాన్ని ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని సూచించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



విద్యార్థుల గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తున్న కేంద్రం సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం పరీక్షకు 796మందిలో 788మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 796మందికి గాను 790మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి 14మంది గైర్హాజరయ్యారని కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు.

మధ్యవర్తిత్వ ప్రాధాన్యాన్ని పెంచాలి

ఖమ్మంలీగల్: కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసులను మధ్యవర్తిత్వ పరిష్కార ప్రక్రియ ద్వారా పరిష్కరించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, మధ్యవర్తిత్వ కేంద్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ బాషా సూచించారు. ఖమ్మంలో శనివారం ఆయన మధ్యవర్తిత్వ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ప్రతీ కక్షిదారుడికి మధ్యవర్తిత్వ కేంద్రం పనితీరును వివరిస్తూ కేసులను పరిష్కరించడం ద్వారా నమ్మకం పెంచాలని తెలిపారు. ఈసమావేశంలో న్యాయవాదులు శ్రీనివాసశర్మ, పి.వెంకటేశ్వర్లు, రవీంద్రశర్మ ఎస్.రమాదేవి, వైసు బ్రహ్మణ్యం, మారగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగమే అన్ని చట్టాలకు మూలం

దేశంలో రూపొందించే అన్ని చట్టాలకు రాజ్యాంగమే మూలమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. దానవాయిగూడెంలోని జిల్లా జైలులో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలు ఆరా తీయడంతో పాటు త్వరలోనే విచారణ ముద్దాలు, ఖైదీలకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్, అధికారులు లక్ష్మీనారాయణ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన పాలేరు



వెలవెలబోతున్న పాలేరు రిజర్వాయర్ (ఇన్‌సెట్) 12 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

వెలవెలబోతున్న రిజర్వాయర్

- 12 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- పైనుంచి విడుదల చేయకపోతే తాగునీటి అవసరాలకూ కష్టమే..
- మరోపక్క పంటలకు విడుదల చేయాలని కోరుతున్న రైతాంగం

కూసుమంచి: జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. అది కూడా గణనీయంగా పడిపోతుండడం అటు అధికారులు, ఇటు జిల్లా వాసులను కలవరానికి గురిచేస్తోంది. రిజర్వాయర్‌కు కొంత కాలంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి జలాలు చేరకపోవడం, ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటమట్టం 23 అడుగులు కాగా, శనివారానికి 12 అడుగులకు పడిపోయింది. రానురాను ఇది మరింత తగ్గనుండగా.. తాగునీటి అవసరాలకూ ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.

మూడు జిల్లాలకు తాగునీరు

పాలేరు రిజర్వాయర్ ద్వారా ప్రతిరోజు 125.60 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటు పాలేరు డీఫ్లోరైడ్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచే ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతోంది. అయితే, ఏటా సాగర్ నుంచి నీరు విడుదల చేస్తుండడంతో ఎలాంటి ఇబ్బంది ఎదురయ్యేది కాదు. కానీ ఈ ఏడాది వర్షాకాలం కృష్ణా బేసిన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. దీంతో సాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరక దిగువకు విడుదల చేయలేదు. ఫలితంగా పాలేరు రిజర్వాయర్‌లో ఉన్న నీటినే తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. ఇకనైనా సాగర్ నుండి నీరు విడుదల చేయకపోతే నీటిమట్టం కొద్దిరోజుల్లోనే మరింత తగ్గి రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరే ప్రమాదముంది. అప్పుడు తాగునీటి పథకాలకు కూడా విడుదల చేసే పరిస్థితి ఉండదు.

మమ్మల్ని పట్టించుకోండి..

ఈసారి సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో పాలేరు రిజర్వాయర్ నీటిని తాగు అవసరాలకే వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. ఇంతలోనే యాసంగి పంటగా పాలేరు కాలువ పరిధి రైతులు పలువురు వరి సాగు మొదలుపెట్టారు. గతంలోనూ రిజర్వాయర్‌లో నీరు తగ్గినా పాలేరు కాల్వ కింద పంటలకు విడుదల చేసేవారు. ఈసారి కూడా అదేధైర్యంతో రైతులు వరి నాట్లు వేశారు. ఈనేపథ్యాన కనీసం నాలుగైదు తడులన్నా సాగు నీరు అందించాలని వారు వేడుకుంటున్నారు. పంటలు ఎండిపోయే స్థితిలో ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించగా ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

తక్షణం 1.5 టీఎంసీలు ఇస్తేనే..

పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా తగ్గినందున ఇప్పటికిప్పుడు 1.5టీఎంసీల నీరు విడుదల చేస్తేనే తాగునీటి అవసరాలు తీరే అవకాశముంది. అలాగే, ఏప్రిల్‌లో మరో 1.5 టీఎంసీల నీరు అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించినట్లు జిల్లా యంత్రాంగం చెబుతోంది. కాగా, ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వాయర్‌కు శ్రీరాంసాగర్ నీరు చేరే అవకాశం లేనందున సాగర్ జలాలే విడుదల చేయాల్సి ఉంటుందని సమాచారం. ఇక పాలేరు కాల్వకు సాగునీటి విడుదలపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెబుతున్నారు.

బీఆర్ఎస్ దిమ్మతిరిగేలా గ్యారంటీలు

- పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



చింతకాని మండలం చినమండవలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

మధిర: బీఆర్ఎస్ నేతలకు దిమ్మ తిరిగేలా త్వరలోనే రెండు గ్యారంటీలను అమలు చేయనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిర, చింతకాని మండలాల్లో శనివారం పర్యటించిన ఆయన పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో భట్టి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమించిన నేపథ్యాన ఎన్నికలకు ముందు విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఆధారంగా ఉద్యోగాల నియామకం పారదర్శకంగా చేపడతామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా.. రాష్ట్రంలో దాదాపు 10కోట్ల మంది వినియోగించుకున్నారని చెప్పారు. అలాగే, గత పదేళ్లుగా మెరుగైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న పేదల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని భట్టి ఈ సందర్భంగా వెల్లడించారు.

సంపద సృష్టి.. పేదలకు పంపిణీ

రాష్ట్రంలో సంపద సృష్టించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని భట్టి వెల్లడించారు. వ్యవసాయం, నీటిపారుదల, ఐటీ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఇందిరమ్మ రాజ్యంలో పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని గత పాలకుల చేతుల్లో పెడితే అప్పుల పాలు చేశారని, ఆ అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల పన్నులతో వచ్చే ప్రతీ పైసా ప్రజలకే పంచుతామని, ఆరు గ్యారంటీలు తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంత్రుల పర్యటనల సందర్భంగా విపక్ష నాయకులను పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించేవారని.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వాళ్ళు ఉండాలి, ప్రతిపక్షాలు ఉండాలనే భావనతో తాము అధికారంలోకి రాగానే ధర్నాచౌక్ తెరిపించామని భట్టి వెల్లడించారు.

అభివృద్ధి బాధ్యత నాదే...

మధిర నియోజవర్గ సమగ్రాభివృద్ధి బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నికల వేళ ప్రజలకు వాగ్దానం చేసినట్టుగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేశామని.. వాటి అమలుపై దృష్టి సారించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించడమే కాక విద్య, వైద్యరంగాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కాగా, మధిర, చింతకాని మండలాల్లో పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు.

జిల్లాలో సీఐల బదిలీలు

నగరంలో అందరికీ స్థానచలనం

ఖమ్మంక్రైం: జిల్లాలో సీఐల బదిలీలు ప్రారంభమయ్యాయి. ఈమేరకు శనివారం పలువురు సీఐలను బదిలీ చేయగా... జిల్లా కేంద్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులకు స్థానచలనం కలగడం గమనార్హం. అయితే, వీరందరినీ మళ్లీ నగర పరిధిలోని స్టేషన్లకే కేటాయించడంతో నగరంలో పోస్టింగ్ కోసం యత్నిస్తున్న సీఐల్లో నిరాశ అలుముకున్నట్లు తెలుస్తోంది.

పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం
వి.ఉదయ్‌కుమార్	ఖమ్మం సీసీఆర్‌బీ	ఖమ్మం వన్‌టౌన్
టి.స్వామి	ఖమ్మం వన్‌టౌన్	సీసీఆర్‌బీ
డి.రమేష్	దుమ్ముగూడెం	ఖమ్మం త్రీటౌన్
బి.సత్యనారాయణ	ఖమ్మం త్రీటౌన్	ఖమ్మం సీసీఎస్–1
బి.బాలకృష్ణ	ఖమ్మం సీసీఎస్–1	ఖమ్మం టూటౌన్
కుమారస్వామి	ఖమ్మం టూటౌన్	ఐజీ కార్యాలయం
భానుప్రకాశ్	సిద్దిపేట త్రీటౌన్	ఖానాపురం హవేలీ
శ్రీహరి	ఖానాపురం హవేలీ	ఐజీ కార్యాలయం
టి.కిరణ్	మహదేవ్‌పూర్	సత్తుపల్లి
జె.మోహన్‌బాబు	సత్తుపల్లి	ఐజీ కార్యాలయం

కూరాకులపై నెగ్గిన అవిశ్వాసం?!

- అనుకూలంగా చేతులెత్తిన 11మంది డైరెక్టర్లు
- 30న వివరాలు వెల్లడిస్తామన్న అధికారులు



అవిశ్వాస సమావేశం అనంతరం విజయ సంకేతం చూపిస్తున్న డైరెక్టర్లు

రఘునాథపాలెం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్మన్‌గా కొనసాగుతున్న రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కొద్దిరోజుల క్రితం సొసైటీలోని 13మందికి గాను 11మంది డైరెక్టర్లు ఆయనపై అవిశ్వాసం ప్రవేశపెడుతూ లేఖ సమర్పించగా శనివారం డీసీఓ విజయకుమారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. కాగా, అవిశ్వాసం ప్రకటించిన నాటి నుంచి క్యాంపులో ఉన్న డైరెక్టర్లు నేరుగా సమావేశానికి హాజరయ్యారు. అయితే, ఈ విషయమై చైర్మన్ నాగభూషణం కోర్టును ఆశ్రయించగా సమావేశం నిర్వహించినప్పటికీ వివరాలు బయటకు వెల్లడించవద్దని ఆదేశించింది. దీంతో డైరెక్టర్లు రావెళ్ల శ్రీనివాసరావు, చంద్రా మురళీకృష్ణ, బానోత్ వెంకన్న, జంగా అనిత, గుడ్ల సుగుణ, బానోత్ రామారావు, తేజావత్ బావ్‌సింగ్, రావూరి సైదబాబు, గుండె ఆదినారాయణ, గోపగాని ముత్తిలింగం, మెర్రి మేకల నాగేశ్వరరావు చేతులెత్తి ఆమోదం తెలిపినట్లు తెలుస్తుండగా, ఫలితాన్ని మాత్రం 30వ తేదీన వెల్లడిస్తామని డీసీఓ తెలిపారు. అయితే, వివరాలు బయటకు వెల్లడించనప్పటికీ అవిశ్వాసానికి ఆమోదం లభించిన నేపథ్యాన పీఏసీఎస్ చైర్మన్‌గానే కాకుండా డీసీసీబీ చైర్మన్ పదవిని సైతం నాగభూషణం కోల్పోయే అవకాశముంది.

గైర్హాజరైన చైర్మన్, ఒక డైరెక్టర్

వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతున్న నాగభూషణంపై ఏర్పాటుచేసిన అవిశ్వాస సమావేశానికి ఆయనతో పాటు ఇంకో డైరెక్టర్ ఎం.సింహాద్రి గైర్హాజరయ్యారు. కాగా, పీఏసీఎస్ కార్యాలయం వద్దకు ఉదయం నుంచే కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకోగా, రఘునాథపాలెం ఎస్ఐ కొండలరావు ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు. సమావేశం అనంతరం వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్ రావూరి సైదబాబు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధిలో చైర్మన్‌గా కూరాకుల సరైన పాత్ర పోషించకపోవడంతోనే అవిశ్వాసానికి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అంతేతప్ప రాజకీయ ఉద్దేశం లేదని తెలిపారు. కాగా, తమ సొసైటీ నుంచే ఒకరికి డీసీసీబీలో డైరెక్టర్‌గా, చైర్మన్‌గా అవకాశం కల్పించాలని వారు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు.

పేదప్రజలకు మెరుగైన వైద్యం

- ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమని.. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరికరాలు సమకూర్చడమే కాక వైద్యులను నియమిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత సర్పంచ్ వాంకుడోతు విజయదీపక్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా మంత్రి మాట్లాడారు. తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు నీలోహన, శ్రీనివాస్, తానాజీ, ఆదిత్యరాజ్, విశ్వనాథ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, రాణి, మానుకొండ రాధాకిషోర్, దేవ్‌సింగ్, బాతుల రమని, సుధాకర్, నాగుల్‌మీరా, బండి వెంకన్న, బండి నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, మారం కరుణాకర్‌రెడ్డి, చెరుకూరి పూర్ణ, గుడిపుడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ఎల్‌టీ(ఎంఎల్‌టీ) ఒకేషనల్ కోర్సులో 2019తర్వాత ఉత్తీర్ణులైన వారికి ఏడాది పాటు ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో క్లినికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు తెలిపారు. ఈమేరకు అభ్యర్థులు ఆస్పత్రి పేరిట రూ.వెయ్యి డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బయోడేటాతో పాటు రూ.10 పోస్టల్ స్టాంప్స్ అతికించిన సొంత చిరునామా పొందుపర్చిన కవర్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో తమ కార్యాలయంలో వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఇక ఐదు రోజులే...

ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల గడువు

- 2 నుంచి ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం
- ఆదేశాలు రాకముందే అధికారుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామపంచాయతీలు

చుంచుపల్లి/ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీల్లో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం శాఖలవారీగా అధికారుల కేటా యింపు, ఏర్పాట్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగిసిన తర్వాత సకాలంలో ఎన్నికలను నిర్వహించాలంటే నెల రోజుల ముందు నుంచే ఆ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇక ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రత్యేక పాలన వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. తమకే తిరిగి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అవకాశం ఇవ్వాలని ప్రస్తుత సర్పంచ్‌లు కోరుతున్నా, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అది సాధ్యం కానందున ప్రత్యేక పాలన అనివార్యం అవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు గత వారం రోజులుగా శాఖలవారీగా ఉద్యోగుల వివరాలను సేకరించారు. జిల్లా, మండ ల, గ్రామ స్థాయిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, సిబ్బంది హోదా ల ఆధారంగా ప్రత్యేకాధికారుల జాబితా రూపొందించారు. వారి హోదాను బట్టి ఏయే గ్రామాల బాధ్యతలను కేటాయించాలనే దానిపై జిల్లా పంచా యతీ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు.

ఉమ్మడి జిల్లాలో 1,070 పంచాయతీలు..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 1,070 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఖమ్మంలో 589, భద్రాద్రిలో 481 ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాకముందే జిల్లా పంచాయతీ అధికారులు స్పెషలాఫీసర్ల నియామకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంపీఓ, జూనియర్ అసిస్టెంట్ స్థాయికి తగ్గకుండా ఉండేవారిని నియమించేలా చర్యలు చేపట్టారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను సర్దుబాటు చేసే వీలుంది. ఇందుకోసం ప్రధానంగా రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్ ఏఈలు, డీఈలు, మున్సిపల్ అధికారులు, అగ్రికల్చర్ ఏఈఓలు, ఇరిగేషన్, మిషన్ భగీరథ, రోడ్లు భవనాలు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు స్పెషలాఫీసర్లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇక గ్రామాల పరిధిలో తాగునీటి సరఫరా, నూతన నిర్మాణాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, పైపుల లీకేజీలను అరికట్టడం, మోటార్ల మరమ్మతులు, దుకాణాల పన్నుల వసూలు, తాగునీటిలో క్లోరినేషన్, రోడ్లు, కాల్వలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన వస్తే ప్రగతికి ఆటంకం ఏర్పడుతుందనే చర్చ సాగుతోంది. గ్రామాల్లో నీటి పథకాలు మరమ్మతులకు గురైనా, వీధిలైట్లు వెలగకపోయినా ప్రజా అవసరాల దృష్ట్యా ఇప్పటివరకు సర్పంచ్‌లే తమ సొంత డబ్బు వెచ్చించి ఆ తర్వాత ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చినప్పుడు తీసుకునేవారు. ప్రత్యేక పాలనలో అలాంటి స్వేచ్ఛ ఉండనందున నిబంధనల మేరకే పనులు చేపట్టాల్సి ఉంటుంది.



గ్రామపంచాయతీ కార్యాలయం

పెండింగ్ బిల్లులపై ఆందోళన..

గతే ఐదేళ్లలో గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని సర్పంచ్‌లు చేయగా, మరికొన్ని కాంట్రాక్టర్లు చేశారు. ఇందులో వైకుంఠధామాలు, కంపోస్టు షెడ్‌ల బిల్లులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో మంజూరు కాలేదు. కలెక్టరేట్ ప్రారంభోత్సవ సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షలు స్పెషల్ గ్రాంట్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయా నిధులకు సంబంధించి ఉత్తర్వులు వెలువడకముందే పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. వీటితోపాటు గత ప్రభుత్వం ఎన్నికల ముందు పెద్దమొత్తంలో సీసీ రోడ్ల నిధులు మంజూరు చేసింది. కానీ అవి నేటికీ గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ కాలేదు. అంతేకాక గ్రామ పంచాయతీలకు గత మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సక్రమంగా మంజూరు కావడం లేదు. దీంతో సాధారణ పనులు చేపట్టడం కూడా సర్పంచ్‌లకు కష్టంగా మారింది. ఎలాగైనా నిధులు వస్తాయనే నమ్మకంతో అప్పు చేసి పనులు చేపడితే నేడు ఆ బిల్లులు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. దాదాపు ప్రతి గ్రామపంచాయతీకి రూ. 2లక్షల నుంచి రూ. 4లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితిలో మరో నాలుగు రోజుల్లో పరిపాలన గడువు ముగుస్తుండడంతో తాము పెట్టిన పెట్టుబడి ఎలా వస్తుందో అనే ఆందోళన సర్పంచ్‌ల్లో వ్యక్తమవుతోంది.

జాబితా సిద్ధం చేస్తున్నాం



గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 2వ తేదీతో ముగుస్తుంది. తర్వాత ఏం చేయాలనే దానిపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు వెలువడలేదు. గడువు తక్కువగా ఉన్నందున ముందు జాగ్రత్తగా గ్రామపంచాయతీల వారీగా ప్రత్యేక అధికారులను ఎంపిక చేసి, జాబితా సిద్ధం చేసుకుంటున్నాం.

– లక్ష్మీరమాకాంత్, డీపీఓ, భద్రాద్రి జిల్లా

క్లుప్తంగా

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ శనివారం రెండో రోజుకు చేరింది. ఈసందర్భంగా ఖమ్మం రూరల్–కామేపల్లి జట్లు తలపడగా బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం రూరల్ 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. ఆతర్వాత కామేపల్లి 117 పరుగులకే ఆలౌట్ కావడంతో ఖమ్మం రూరల్ జట్టు 17పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ కల్లూరు–ఏన్కూరు జట్ల మధ్య జరగగా కల్లూరు నాలుగు వికెట్లు నష్టానికి 168 పరుగులు చేయగా, ఏన్కూరు కేవలం 27 పరుగులే చేయగలిగింది. దీంతో 141 పరుగుల తేడాతో కల్లూరు జట్టు విజయం సాధించింది. తొలుత మ్యాచ్‌లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి ప్రారంభించగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ ఎం.డీ.గౌస్, పీడీ డాక్టర్ బి.వెంకన్న, టోర్నీ నిర్వాహకులు ఎం.డీ.మతిన్, నరేష్, వెంకట్, సలీం, విజయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ 'ఎట్ హోమ్'లో రెజొనెన్స్ డైరెక్టర్లు


గవర్నర్ పుష్పగుచ్ఛం ఇస్తున్న నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి ఖమ్మంలోని రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లకు ఆహ్వానం లభించింది. ఈమేరకు డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, నీలిమ పాల్గొని గవర్నర్ తమిళిసైకు పుష్పగుచ్ఛం అందజేశారు.

సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌కు 'రెజొనెన్స్ శ్రీనగర్' విద్యార్థి


శ్రీవల్లిని అభినందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన శ్రీధర్‌రావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ పాఠశాల విద్యార్థిని డి.శ్రీవల్లి రాష్ట్రస్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకే శనివారం స్కూల్ డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణితో కలిసి విద్యార్థిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలవగా ఆయన అభినందించారు. అనంతరం డైరెక్టర్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా బోధన చేస్తున్నామని తెలిపారు. డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి సొసైటీ సీఈఓను తొలగించాలి


డీసీఓకు వినతిపత్రం ఇస్తున్న డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్న బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి పీఏసీఎస్ సీఈఓ నాగరాజును విధుల నుంచి తొలగించాలని డైరెక్టర్లు కోరారు. ఈ సందర్భంగా ఆరుగురు డైరెక్టర్లు శనివారం ఖమ్మంలో జిల్లా సహకార అధికారి(డీసీఓ) ఏ.విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. సంఘం మహాజన సభలు నిర్వహించకుండా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, రూ.9 కోట్ల లావాదేవీలు ఉన్న సంఘం కార్యకలాపాలను డైరెక్టర్లకు తెలపడం లేదని ఆరోపించారు. సొసైటీ వైస్ చైర్మన్ జి.రాఘవరావు, డైరెక్టర్లు పార్వతి, అచ్చయ్య, తోట వెంకటేశ్వర్లు, ఏనుగు సుధాకర్‌రావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీపీ ప్రతినిధిగా సైదులు


ప్రమాణస్వీకారం చేస్తున్న సైదులు

ఖమ్మంగాంధీచౌక్: ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్(ఏఐఎఫ్‌టీపీ) ఆఫీస్ బేరర్ల ప్రమాణ స్వీకారం శనివారం విజయవాడలో జరిగింది. ఈ కార్యవర్గంలో సహాయ కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన వుల్లిబోయిన సైదులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయనను అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బర్ధుల దర్గా ప్రసాదరావుతో పాటు పవన్‌కుమార్, జి.రమేష్, ఏ.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

రంగు మారింది..


ఖమ్మంలోని ఓ రేడియం షాపు వద్ద అంబులెన్స్‌లు


వాహనంపై గులాబీ రంగు స్టిక్కర్లు తొలగిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువుదీరగా.. పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందులో భాగంగానే 108 అంబులెన్స్‌ల రంగులను సైతం మారుస్తున్నారు. అంబులెన్స్‌లపై గులాబీ రంగు స్టిక్కర్లు ఉండగా వాటిని తొలగించి తెల్ల రంగు వేయిస్తున్నారు. అలాగే, గత సీఎం కేసీఆర్ చిత్రాలను తొలగించారు. ఈ మేరకు ఖమ్మంలోని ఓ రేడియం షాపు వద్ద శనివారం అంబులెన్స్‌లు బారులుదీరి కనిపించాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి...

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కేయూ వీసీ తదితరులు

ఖమ్మం రూరల్: విద్యార్థులు చదువును ఇష్టపడుతూ శ్రద్ధగా చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన సృజనోత్సవ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని, వాటిని చేరుకునేందుకు నిరంతరం తప్పించాలని సూచించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.రమేష్, కవి మువ్వా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం హన్మంతరెడ్డి తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా తల్లిదండ్రుల ఆదరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకోగా... సినీ నాయిక అనన్య నాగళ్ల, గాయకులు అనిరుధ్, సౌజన్య, తనన్య, కూచిపూడి నృత్యకళాకారిణి ఏలూరి మీనా తమ ఆటపాటలతో అలరించారు. సృజనోత్సవ్ కన్వీనర్ అట్లూరి వెంకటరమణ, కోఆర్డినేటర్ ఎం.శివకుమార్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.గోపాల్, వి.రామారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన 'కొత్వాల'


కొత్వాల శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. డీసీసీబీ నుంచి తీసుకున్న వాహన రుణాన్ని సకాలంలో చెల్లించకపోవటంతో డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావుపై సహకార చట్టం ఆధారంగా అనర్హత వేటు వేసిన విషయం విదితమే. దీంతో శేషగిరిరావు తల్లాడ మండలం గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గానే కాక డీసీఎంఎస్ చైర్మన్ పదవులు కోల్పోయారు. అనంతరం వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావును చైర్మన్‌గా నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.


వీరభద్రరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

గంగదేవిపాడు చైర్మన్‌గా వీరభద్రరావు

తల్లాడ: గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా మిట్టపల్లికి చెందిన తూము వీరభద్రరావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న వెంకటశేషగిరిరావుపై వేటు పడటంతో ఉపాధ్యక్షుడి గా ఉన్న వీరభద్రరావును నియమించడంతో ఆయన కార్యదర్శి రాకేశ్ సమక్షాన బాధ్యతలు స్వీకరించారు. నూతనకల్ సర్పంచ్ తూము శ్రీనివాసరావుతో పాటు జంగా చిన్నవెంకట్‌రెడ్డి, నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు, రోశయ్య, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

'కానిస్టేబుల్ కుటుంబం నుంచి ప్రాణహాని ఉంది..'

నేలకొండపల్లి: ఓ కానిస్టేబుల్ కుటుంబీకులు భూమి కబ్జాకు యత్నించడమే కాక తమను చంపుతామని బెదిరిస్తున్నారంటూ నేలకొండపల్లి మండలంలోని చెన్నారానికి చెందిన నల్లమల్ల రామారావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన తమను కాపాడాలంటూ మంత్రులు, పోలీస్ అధికారులను కోరుతూ శనివారం విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. రైతు కుటుంబానికి చెందిన తమ భూమి ఆక్రమణకు అదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కుటుంబం యత్ని స్తోందని ఆరోపించారు. ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన తమపై దాడికి యత్నించడమే కాక చంపుతామని బెదిరించారని వాపోయాడు. తమ కుటుంబానికి హానీ ఉన్నందున మంత్రులు, పోలీసు అధికారులు స్పందించి న్యాయం చేయాలని రామారావు కోరాడు.

ఫోన్ కోసం వెళ్తూ రోడ్డుప్రమాదంలో మృతి


రాము (ఫైల్)

సత్తుపల్లిటౌన్: మరిచిపోయిన ఫోన్ తీసుకునేందుకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఇది. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. బుగ్గపాడుకు చెందిన సవలం రాము(18) తల్లిదండ్రులతో కలిసి నల్లివారిగూడెంలో ఎరువు తోలకం పనులకు వెళ్లొచ్చాడు. అక్కడ ట్రాక్టర్‌లో తన ఫోన్ మర్చిపోవడంతో స్నేహితుడైన ఏసుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నాగుపల్లి వైపు నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా రాము మృతి చెందాడు. ఇదేఘటనలో ఏసుబాబుకు సైతం తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు


టీఎస్‌యూఈఈయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ రంగంలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూఈఈయూ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం ఖమ్మంలో శనివారం జరగగా ఈశ్వరరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. పీస్ రేటు, అన్‌మ్యాన్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంతోపాటు ఆర్టిజన్లను పర్మనెంట్ చేయాలని, 2014 జేఎల్‌ఎంలకు ఎరియర్స్ ఇస్తూ ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ ఉద్యోగులకు తక్షణమే డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పుష్పరాణి, కామినేని నాగేశ్వరరావుతో పాటు దొడ్డ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం డైరీ, క్యాలెండర్లను ఆహుతులు ఆవిష్కరించారు.

మతోన్మాద శక్తులపై పోరాటాలకు సిద్ధం కావాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులపై ఆనాటి స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితో విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్‌భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు క్యాలెండర్లు ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్య్ర పోరాటంలో అగ్రభాగాన నిలిచిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని తెలిపారు. కాగా, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేలా విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. విద్యను కాషాయీకరణ వైపు తీసుకువెళ్తూ శాస్త్రీయమైన ఆలోచనలు, శాస్త్రీయ విద్యను దూరం చేసేలా మత భావాలు ఉన్న పాఠ్యాంశాలతో జాతీయ నూతన విద్యా విధానం తీసుకొస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బీజీ క్లెమెంట్, రావి శివరామకృష్ణ, జానీమియా, పోటు పూర్ణచందర్‌రావు, మేకల శ్రీనివాసరావు, శంకర్‌రావు, ఇటికాల రామకృష్ణ, శివ, చందూలాల్, ఉజ్వల్, నరేశ్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు నష్టం ఎదురుకావొద్దు

- నాణ్యత ఆధారంగా ధర నిర్ణయించాలి
- వ్యాపార ప్రతినిధుల సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్


వ్యాపార ప్రతినిధులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మార్కెట్‌కు మిర్చి తీసుకొచ్చే రైతులు నష్టపోకుండా నాణ్యత ఆధారంగా ధర నిర్ణయించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ఖమ్మం మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. మిర్చి జెండాపాట ధరకు, ఆ తర్వాత చెల్లిస్తున్న ధర రూ.వేలల్లో వ్యత్యాసం ఉంటోందని తెలిపారు. తెలంగాణలోనే మిర్చి కొనుగోళ్లలో ఖమ్మం మార్కెట్‌కు మంచిపేరు ఉన్నందున ఇతర జిల్లాల నుంచి సైతం రైతులు వస్తున్నారన్నారు. ఈమేరకు రైతులు నష్టపోకుండా ధర ఖరారు చేయాలని సూచించారు. ఈసందర్భంగా వ్యాపార ప్రతినిధులు మాట్లాడుతూ నెల క్రితం అకాల వర్షాలతో పంట దెబ్బతిని, తాలు అధికంగా ఉంటోందని తెలిపారు. అలాగే, తేమ ఎక్కువ ఉన్న మిర్చిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారని వివరించారు. ఇక మునుపెన్నడూ లేని విధంగా తేజా రకంతో పాటు ఆర్మూర్, ఇతర రకాల మిర్చి కూడావస్తున్నందున ధరలో తేడా కనిపిస్తుందని తెలిపారు. ఈ మేరకు తేజా రకం ధరతో ఇతర రకాలకు చెల్లించే ధరను పోల్చిచూడొద్దని కోరారు. ఫిబ్రవరిలో రెండో కోత మొదలైతే నాణ్యమైన మిర్చి వస్తుందని, ఆ సరుకుకు ఆశించిన మేర ధరలభిస్తుందని తెలిపారు. ఆతర్వాత పంట కొనుగోళ్ల పర్యవేక్షణపై మార్కెట్, ఉద్యాన, వ్యవసాయ అధికారులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, అధికారులు రమణ, బి.బజార్, వజీరుద్దీన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు తల్లాడ రమేష్, యడ్లపల్లి సతీష్, బండారు యాకయ్య, మలివెట్టి వెంకటేశ్వర్లు, దిరిశాల వెంకటేశ్వర్లు, సోమారపు సుధీర్‌కుమార్, కైలాసపు వేణుగోపాల్, జంగిలి రమణ, విడాల శ్రీను, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

కార్పొరేటర్ భర్త, ఎంపీటీసీ సహా 12 మంది అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ బాలాజీనగర్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ఖమ్మం అర్బన్ పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కార్పొరేటర్ భర్త, ఎంపీటీసీ సహా 12మందిని అరెస్ట్ చేసి రూ.42వేలకు పైగా నగదు, 73 క్యాష్ కాయిన్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ హరికృష్ణ, సీఐ శ్రీహరి శనివారం వెల్లడించారు. నగరంలో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసినట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో 12మంది పట్టుబడగా 27వ డివిజన్ కార్పొరేటర్ కొప్పెర ఉపేందర్‌రావు, పేరుపల్లి ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారని తెలిపారు. వీరిపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.


బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై..

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ హరికృష్ణ తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా ఖమ్మం అర్బన్ పోలీసులు శుక్రవారం రాత్రి ధంసలాపురం బ్రిడ్జి కింద బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఐదుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి వేళ సమయానికి మించి షాపులు తెరిచిన వారిపై కేసు నమోదుచేస్తామని తెలిపారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం మల్లేపల్లి రోడ్డులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు. మండలంలోని మంచుకొండకు చెందిన ఎనిమిది మంది చెరువుకట్టపై పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.1.450 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

19 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

నేలకొండపల్లి: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఎండుగంజాయిని కూసుమంచిలో ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన సమీరన్ బైరాగి శనివారం హైదరాబాద్‌కు గంజాయితో బయలుదేరాడు. ఖమ్మం నుంచి కూసుమంచి మండలంలోని పాలేరు బస్టాండ్‌కు రెండు బ్యాగ్‌లతో చేరుకున్నాడు. అదేసమయాన అక్కడకు వచ్చిన ఎక్సైజ్ సీఐ పోశెట్టి, ఉద్యోగులు అనుమానంతో ఆయనను తనిఖీ చేయగా 19 కేజీల గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఏఎస్సై రాధాకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద...

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు శనివారం ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ యువకుడు, ఇద్దరు మైనర్లు వెళ్తుండగా వారి బ్యాగ్‌లు పరిశీలించారు. అందులో ఐదు కేజీల గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన నీలం రాజు ఇద్దరు మైనర్లతో కలిసి గంజాయి కొనుగోలు చేసి హుజురాబాద్ ప్రాంతంలో విక్రయించేందుకు వెళ్తూ పట్టుబడ్డారని ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, సీఐ స్వామి వెల్లడించారు.

83కు చేరిన కుక్కకాటు బాధితులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఏదో ఓ గ్రామంలో పలువురిని కుక్కలు గాయపర్చడం సాధారణమైపోయింది. ఈనెలలో ఇప్పటి వరకు 83 మందిపై వీధి కుక్కలు దాడులు చేసి గాయపరిచాయి. ఇక శనివారం కూడా నేలకొండపల్లి, గువ్వలగూడెం, చెరువుమాదారం, మంగాపురం తండాల్లో ఉప్పలమ్మ, , పద్మ, అనిల్, ఆయూష్, శాహినాబేగం, హసుపన్ తదితరులు కుక్కలో దాడి గాయపడగా నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫాస్ట్ పుడ్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు

కామేపల్లి: బాలుడితో పనిచేయిస్తున్న కామేపల్లి మండలం ముచ్చర్ల క్రాస్ రోడ్డులోని ఫాస్ట్ పుడ్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదైంది. షాప్‌లో 15ఏళ్ల బాలుడితో పనిచేయిస్తున్నట్లు తేలగా నిర్వాహకుడు సతీష్‌పై శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

కారేపల్లి: కుటుంబ తగాదాల నేపథ్యాన కారేపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారేపల్లికి చెందిన అన్నారపు శ్రీను(48) మట్టి కుండల వ్యాపారం చేస్తుంటాడు. అయితే, భార్యాభర్తలకు నాలుగేళ్లుగా మనస్పర్థలు రావడంతో శ్రీను, ఆయన భార్య పద్మ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివసిస్తున్నారు. వీరి కుమారైకు వివాహం జరగగా, కుమారుడు తల్లాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలోనే శ్రీను శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గదిలో నుంచి పెద్ద శబ్దం రావడంతో భార్య వచ్చి చూసేసరికి శ్రీను ఉరి వేసుకుని ఉండగా.. స్థానికులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఘటనాస్థలికి కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు చేరుకుని విచారణ చేపట్టారు.